www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 30 సెప్టెంబరు 2024





## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ :** చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం లో నిర్వహించ నున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. నియో జక వర్గ, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదు దారుల నుండి అందిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# డేంజర్ జోన్ మొగిలి ఘాట్

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో మొగిలి ఘాట్ రోడ్డు డేంజర్ జోన్‌గా మారింది. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఇంటర్‌సెప్టర్ వాహనాన్ని మొగిలి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేస్తోంది. ఈ వాహనాల వేగాన్ని పర్యవేక్షించడం మాత్రమే కాకుండా, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనుంది. మొగిలి ఘాట్ వద్ద చెక్ పోసులు ఏర్పాటు చేసి అంబులెన్స్, క్రేన్‌ను అందుబాటు ఉంచనున్నారు. ఈ ఘాట్ రోడ్డును డేంజర్ జోన్‌గా వాహనదారులకు తెలిసేలా 200 మీటర్లకు ఒకచోట వివిధ భాషలలో హోర్డింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని జాతీయ రహదారులపై నెత్తుటి మరకలు ఆరక ముందే శనివారం మరో ప్రమాదం చోటు చేసుకుంది. తరచూ జరుగుతున్న ఈ ప్రాంత ప్రమాదాల్లో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. 2019లో 128 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 84 మంది మృతి చెందారు. 175 మందికి గాయాలయ్యాయి. 2020లో 121 ప్రమాదాలు చోటు చేసుకోగా 46 మంది మృతి చెందారు. 154 మంది గాయాలపాలయ్యారు. 2021లో 132 ప్రమాదాలు సంభవించగా 47 మంది మృతి చెందారు. 165 మంది గాయపడ్డారు. 2022లో 114 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 65 మంది మృతి చెందారు. 124 మంది గాయపడ్డారు. 2023లో 133 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 64 మంది మృతి చెందారు. 211 మంది గాయపడ్డారు. 2024 సెప్టెంబరు 20 వతేది వరకు 119 ప్రమాదాలు సంభవించగా జాతీయ రహదారులపై చోటు చేసుకోగా 64 మంది మృతి చెందారు. 211 మంది గాయపడ్డారు.

**అతివేగంగా నడిపితే జరిమానా**




ఇటీవల ఘాట్ రోడ్డులో చోటుచేసుకున్న ప్రమాదం (ఫైల్‌ఫోటో)

## ప్రమాదాల నివారణకు ఇంటర్‌సెప్టర్ ఏర్పాటు

జిల్లాలోని బంగారుపాళ్యం, పలమనేరు మధ్య వున్న మొగిలి ఘాట్ రోడ్డులో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వాహనాల అతి వేగం వల్లే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహన దారులు ఘాట్‌లో నిర్దిష్ట వేగ పరిమితి కంటే ఎక్కువగా వెళ్లడం వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి, ప్రజల ప్రాణాలు రక్షించడానికి మొగిలి ఘాట్ ప్రాంతంలో వాహనాల వేగాన్ని పర్యవేక్షించడానికి ఒక 'ఇంటర్‌సెప్టర్ వాహనం' ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వాహనం ప్రత్యేకంగా వాహనాల వేగాన్ని కొలిచే అత్యాధునిక పరికరాలతో అమర్చారు. 40 కిమీమీటర్లకు పైగా వేగంతో వెళ్లే వాహనాలను ఈ ఇంటర్‌సెప్టర్ వాహనం ద్వారా గుర్తించి, పోలీసు సిబ్బంది వారికి జరిమానా విధిస్తారు. దీని ద్వారా మొగిలి ఘాట్ ప్రాంతంలో ప్రమాదాలను తగ్గించవచ్చు. ఇంటర్‌సెప్టర్ వాహనం ఏర్పాటుతో వాహనాల వేగాన్ని పర్యవేక్షించడం మాత్రమే కాకుండా, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**ఇంటర్‌సెప్టర్ తనిఖీలు ప్రారంభం**

సెప్టెంబరులో 20 రోజుల వ్యవధిలో మొగిలి ఘాట్ రోడ్డులో నాలుగు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 18 మంది గాయపడగా, 10 మంది మృతి చెందారు. అతివేగం, మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసు కుంటున్నట్లు పోలీసుశాఖ అంచనా వేసింది. వేగాన్ని నియత్రించడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారుల భద్రతా కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రమాద స్థలాలను గుర్తించిన ప్రాంతాల్లో సూచిక బోర్డులు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించడం, సురక్షితంగా ప్రయాణించడం అత్యంత ముఖ్యం. రోడ్డు భద్రతా సూచనలతో కూడిన సంకేత పదాలు వివిధ పాయింట్లలో ఏర్పాటు చేయనున్నారు. ఘాట్ ప్రాంతంలో ట్రాఫిక్ పెట్రోలింగ్ టీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘా ఉంచి, ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రైవర్‌లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడానికి చిత్తూరు పోలీసులు తరచుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు సీటు బెల్టులు ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను



ఘాట్ రోడ్డులో వాహనాల వేగాన్ని తనిఖీ చేస్తున్న ఇంటర్‌సెప్టరు వాహనం

తగ్గించవచ్చునని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించడం అత్యంత ముఖ్యమైన రక్షణ చర్య అని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, పోలీసులు మద్యం తాగి డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా చిత్తూరు నగరంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలు పడుపుతూ పెద్ద సంఖ్యలో పట్టుబడుతున్నారు. ఈ ఏడాది తొమ్మిది నెలల వ్యవధిలో ఒక చిత్తూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించి వాహన తనిఖీల్లో మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ 339 మంది పట్టుబడ్డారు. వీరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించి రూ.28.7 లక్షలు వసూలు చేశారు.

**ఇంటర్‌సెప్టర్ తనిఖీలతో ప్రమాదాలు తగ్గుముఖం**



మొగిలి ఘాట్‌లో చోటుచేసుకుంటున్న అనేక రోడ్డు ప్రమాదాలను దృష్టిలో వుంచుకుని ఆదివారం నుండి ఇంటర్‌సెప్టర్ వాహనం సాయంతో ఘాట్ ప్రాంతంలో రోడ్డు భద్రతను మరింత కఠినంగా పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. వేగం నియంత్రణతో పాటు, వాహన దారులకు సరైన అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

**– మణికంఠ చందోలు, జిల్లా ఎస్‌పి.**

## శ్రీవారిమెట్టు వద్ద 'చిరుత'

- భయందోళనలో భక్తులు

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:** శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు వద్ద చిరుత పులి కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చిరుత రావడంతో కుక్కలు అరుస్తూ వెంబడించాయి. చిరుతపులి వాటిపై దాడి చేయడానికి పరుగెత్తడంతో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు దీపక్ అప్రమత్తమయ్యాడు. కంట్రోల్ రూమ్‌లోకి వెళ్లి తాళాలు వేసుకున్నాడు. శ్రీనివాస మంగాపురం నుంచి శనివారం ఉదయం 5 గంటలకు భక్తులను శ్రీవారిమెట్టుకు వదిలారు. అదే సమయంలో గార్డు దీపక్ గది నుంచి బయటకు వచ్చి టీటీడీ సెక్యూరిటీ, అటవీ శాఖ అధికారులకు చిరుత గురించి సమాచారమిచ్చాడు. తర్వాత కాలి నడక భక్తులను గుంపులు, గుంపులుగా వదిలారు. శ్రీవారి మెట్టు సమీపంలో పులి సంచారంతో భక్తులు భయందోళనకు గురవుతున్నారు. పెరటాసి మాంసం కావడంతో శ్రీవారి మెట్టు మార్గాన వివిధ రాష్ట్రాల నుంచి కాలినడకన భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. ఈ దశలో ఏ టైం లో ఏం జరుగుతుందోనని భక్తులు భయందోళన చెందుతున్నారు. పులి సంచరించిందని విషయం తెలుసుకున్న అధికారులు భక్తులకు గుంపులు గుంపులుగా తిరుమలకు వెళ్లాలని సూచిస్తున్నారు. కానీ భక్తులు మాత్రం శ్రీవారి భక్తులకు పులి భయం తొలిగేటట్లు టిటిడి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



సిసి కెమెరాకు చిక్కిన చిరుత వృత్తంలో

## కార్తీక్‌కు పిహెచ్‌డి



**ప్రజాశక్తి-కుప్పం టౌన్ :** ద్రావిడ విశ్వవిద్యాలయం తమిళ శాఖలో పరిశోధన చేస్తున్న ఎస్ కార్తీక్‌కు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పినాగేశ్వరరావు తెలిపారు. తమిళ శాఖలోని సహాయ ఆచార్యులు మరియప్పన్ పర్యవేక్షణలో ద్రావిడ భాషల తొలి వ్యాకరణ గ్రంథాలు అన్న అంశంపై సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి ఎస్ కార్తీక్‌కు పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## లైసెన్సు లేని కలపను అనుమతించొద్దు: ఎఫ్ఆర్‌వో



సా మిల్లు యజమానులకు సలహాలిస్తున్న ఎఫ్ఆర్‌వో

**ప్రజాశక్తి- కుప్పం టౌన్ :** అటవీశాఖ లైసెన్సు లేని కలపను సామిల్లు లోకి అను మతించొద్దని కుప్పం ఎఫ్ఆర్ఓ సామిల్లు యజమా నులను హెచ్చరించారు. సామిల్ యజమానులు అటవీ శాఖ నుండి పొందిన అను మతి మేరకే సామిల్ నిర్వహణ ఉండాలని, అలా లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు పట్టా భూములలో పెంచుకున్న కలప నల్లతుమ్మ, తుమ్మ, మామిడి, తైలం వంటి వాటిని రైతు అవసరానికి అనుగుణంగా తొలగించుకోవడానికి రెవెన్యూ, అటవీ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు.

## ఉత్సాహ భరితంగా ఆటల పోటీలు

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా చిత్తూరు జిల్లా యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మెకానికల్ గ్రౌండ్‌లో స్వర్ణోత్సవ క్రీడా సంబరాలను అత్యంత ఉత్సాహ భరితంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర్ నాయుడు ఆదివారం ప్రారం భించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు డివిజన్ల నుండి ఉపాధ్యాయులు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, షాట్ పుట్, జావలిన్ త్రో, పరుగు పందెం, క్యారమ్స్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచ డంలో ఉపాధ్యాయులు ఆరోగ్యవంతంగా రూపొంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి, స్నేహ పూరితమైన వాతావరణం పెంపొందించడానికి తోడ్ప డుతుందన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తూ రాష్ట్ర స్థాయిలో అక్టోబరు 4,5,6వ తేదీల్లో గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలకు అర్హత సాధించిన వారికి అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎన్ మణి గండన్, నాయకులు కే దీనావతి, కే రెడ్డప్ప నాయుడు, కే సరిత, డి ఏకాంబరం, ఎం పార్థసారథి, పంటపల్లి సురేష్, కె గణేష్ కుమార్, పిసి బాబు, ఎం శశి కుమార్, ఎంవి రమణ, మోహన్, వంశీకృష్ణ, సాధన కుమార్ జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు క్రీడాకారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో జిల్లా స్థాయి విజేతలు

## విభిన్న కోణాల్లో దర్యాప్తు..

- లడ్డూ కేసు ప్రాథమిక దశలోనే వుంది..
- తిరుపతిలో మీడియాతో 'సిట్' చీఫ్ త్రిపాఠి

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

తిరుమల లడ్డులో కల్తీ నెయ్యిపై అందిన ఫిర్యాదులో విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వెల్లడించారు. లడ్డు వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు కోసం చీఫ్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సిట్ బృందం శనివారం శ్రీవారి దర్శించుకుని, తిరుపతి పద్మావతి అతిథిభవంలో సిట్ చీఫ్ త్రిపాఠి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం పద్మావతి అతిధి గృహంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావుతో ప్రత్యేకంగా 45 నిమిషాలు పాటు సమావేశం అయ్యారు. కల్తీ నెయ్యిపై ఆరా తీశారు. అనంతరం పక్కనే ఉన్న పోలీస్ అతిథి గృహంలో సిట్ బృందం అంతర్గత సమావేశం అయింది. అనంతరం మీడియాతో సిట్ చీఫ్ త్రిపాఠి మాట్లాడారు. లడ్డులో నెయ్యి కల్తీ ఉందని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో ఆ కేసును తీసుకుని విచారణ ప్రారంభించామన్నారు. ఈ కేసు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే తమిళనాడు చెందిన దిండిగల్ ప్రాంతంలోని ఏఆర్ డెయిరీ పైన ప్రధానంగా ఫిర్యాదు అందిందన్నారు. దానిపై మా సిట్‌లోని ఒక బృందం అక్కడికి వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి తిరుమల, తిరుపతి లోనూ మరో రెండు బందాలు విచారణ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మూడు టీములకు ముగ్గురు అధికారులు కూడా విచారణ బాధ్యతలను అప్పగించామని చెప్పారు. ఎప్పటికప్పుడు కేసు పురోగతి మీడియాకు తెలియజేస్తామని త్రిపాఠి తెలిపారు.





తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న సిట్ చీఫ్ త్రిపాఠి

## మద్యం షాపుల్లో 570 మంది 'ఔట్'

- అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీ
- జిల్లాలో 244 బ్రాందీషాపులు
- రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతికి

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్వాసన (ఔట్) పలకనున్నారు. అక్టోబర్ నుంచి కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రైవేట్‌కు బ్రాందీషాపులను అప్పగించనుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 570 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. సేల్స్ సూపర్‌వైజర్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్రాందీషాపులో నలుగురు ఉంటారు. వీరంతా వైసిపి హయాంలో విధులు చేరిన వారు కావడంతో వీరందరినీ టిడిపి కూటమి ప్రభుత్వం ఇంటికి పంపనున్నట్లు సమాచారం. బ్రాందీషాపుల్లో పనిచేసే ఉద్యోగులు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో, ఆందోళనలకు సమాయత్తం అవుతున్నారు. గతంలో తిరుపతి జిల్లాలో 145 బ్రాందీషాపులు ఉండగా, నూతన మద్యం పాలసీలో 244 దుకాణాలు జిల్లాకు రానున్నాయి. వీటిలో రిజర్వుడ్ 24 ఉండనున్నాయి. ప్రభుత్వానికి పంపిన జనాభా ప్రాతిపదికనే ఈ దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.



**త్వరలో టెండర్లకు ఆహ్వానం**

10 వేల మందిలోపు జనాభాఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాల్సి వుంటుంది. 10 వేలు– 50 వేల మధ్యలో జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేలు– 5 లక్షల మధ్యలో ఉన్నచోట రూ.65 లక్షలు, 5 లక్షల మందికి పైగా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షల ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజును ఏడాదిలోపు ఆరు విడతల్లో చెల్లించేందుకు వ్యాపారులకు వెసులుబాటు కల్పించారు. ఏటా 10 శాతం పెంచుతారు. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఒకట్రెండు రోజుల్లో విడుదల కానుంది. మద్యం దుకాణాలు సొంతం చేసుకునేందుకు చాలామంది రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతున్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ చంద్రచూడ్

**ప్రజాశక్తి- తిరుపతి సిటి:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై.చంద్రచూడ్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన జస్టిస్ డివై.చంద్రచూడ్‌కు టిటిడి ఈవో శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు వేద





రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు తెలిపిన న్యాయమూర్తులు

పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం టీటీడీ ఈవో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిఎస్వో శ్రీధర్, డెప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సాదర వీడ్కోలు**

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణమైన ఆయనకు సాదర వీడ్కోలు లభించింది. జస్టిస్ పి.కష్ణమోహన్, జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ రాఘవ స్వామి, జస్టిస్ రామకృష్ణ, జడ్జి ఈ.భీమారావు, ప్రోటోకాల్ ఆఫీసర్ గురునాథ్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ప్రోటోకాల్ మెజిస్ట్రేట్ పి.కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## బాల కార్మిక, భిక్షాటన రహిత తిరుమలకు కృషి

### రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు

**ప్రజాశక్తి- తిరుమల**

తిరుమలలో బాలకార్మికులు, భిక్షాటన లేకుండా సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతి పేర్కొన్నారు. తిరుమలలో ముఖ్యమైన వీధుల్లో దుకాణాల్లో, హోటల్స్‌లో బాలకార్మికులను, భిక్షాటన చేస్తూ ఉన్న బాలలను గుర్తించడం వారి ఈ పరిస్థితులకు గల కారణాలపై ఆరా తీయడం జరిగింది. వీరిలో ఎక్కువుగా తమిళనాడు కొంతమంది కర్ణాటక, ఒడిస్సా నుండి వచ్చినట్టు గుర్తించడం జరిగింది. ముఖ్యంగా బాలలతో పూసలు బొమ్మలు మొదలగు ఆట వస్తువులు తల్లిదండ్రులతో కలిసి అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. షాపు యజమానులతో సమావేశమై చర్చించి బాలలను పనిలో పెట్టుకుంటే శాఖాపర చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. కొంతమంది విద్యను మధ్యలో వదిలివేసి బాలకార్మికులుగా, భిక్షాటన చేసేవాళ్ళను గుర్తుంచి వారికి కౌన్సెలింగ్ చేసి మళ్ళీ తిరిగి పాఠశాలల్లో, పునరావాస కేంద్రాలలో ప్రవేశించడానికి కొంత మంది తల్లిదండ్రులు అంగీకరించేలా మాట్లాడారు. చంటిపిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలు గురించి ఆరా తీయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శివకుమార్ ,విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



తిరుమలలోని వీధుల్లో భిక్షాటన చేస్తున్న బాలలతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు

## ముగిసిన టౌన్ బ్యాంకు మహాజన సభ

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** చిత్తూరు టౌన్ బ్యాంకు సర్వజన మహాసభ స్థానిక గిరింపేట బ్రాంచులో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు టౌన్ బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్, ఓఎస్డి నారాయణమ్మ ఆడిట్ రిపోర్ట్‌ను బ్యాంకు సభ్యుల ముందు ఉంచారు. ఆడిట్ రిపోర్ట్‌ను చర్చించిన తర్వాత సభ్యులు ఆమోదించారు. ఆడిట్ అప్రూవల్ నిమిత్తం ప్రతి సంవత్సరం జమా ఖర్చులను అప్రూవల్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, టౌన్ బ్యాంక్ డిపాజిట్ దారులు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:** మండలంలోని వినిపూరం గ్రామ పంచాయతీ గంగమ్మ గుడి ఆరి మాని గంగమ్మ నవరాత్రి బ్రహ్మోత్సవాల కరపత్రాలను కూటమి నాయకులు, వైసిపి నాయకులు పోటాపోటీగా ఆవిష్కరించి భక్తులకు, ఉభయ దారులకు, జిల్లా అధికారులకు, నాయకులకు అందించి ఆహ్వానించారు. దీంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రాజకీయరంగు పులుముకుంది. స్థానికులు పార్టీలకు అతీతంగా ఉత్సవాలను నిర్వహించాలని నాయకులను ప్రాధేయపడుతున్నారు.

## ఆకట్టుకుంటున్న నాటకాలు



నాటకాన్ని తిలకిస్తున్న ప్రజలు

**ప్రజాశక్తి -సోమల:** సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో రాత్రి వేళల్లో నాటక కళా కారులు ప్రదర్శిస్తున్న రాత్రి నాటకాలను తిలకించేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. పగలు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హరికథా కాలక్షేపం, సాయంత్రం 9 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు శ్రీకృష్ణ, దుర్యోధన, అర్జున పాండవులు ద్రౌపది వేషధారణ వేసిన కళాకారులు కథకు అనుగుణంగా ప్రదర్శిస్తున్న నాటకాలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. నిర్వాహకులు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ప్రజలకు తాగునీటి వసతి కల్పిస్తున్నారు.

## గృహ నిర్మాణాలపై అవగాహన

**ప్రజాశక్తి -పెద్దపంజాణి:** రాష్ట్ర ప్రభుత్వం, గృహ నిర్మాణశాఖ ఆదేశాల మేరకు మండలంలోని కోగిలేరు గ్రామ పంచాయతీ సమీపంలోని హౌసింగ్ కాలనీలో శనివారం 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ రహీం మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలో, సొంత స్థలం ఉన్నవారికి గతంలో ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరయ్యాయని అయినా ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి స్థాయిలో చేయలేదని త్వరితగతిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇళ్ల నిర్మాణాలకు పొదుపు ఖాతాల నుండి రుణాలు మంజూరు చేస్తారని ఆ డబ్బుతో పనులను ప్రారంభించాలన్నారు. సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతోపాటు గృహాలను మంజూరు చేసిందని అయితే లబ్ధిదారులందరూ అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఇప్పటికైనా పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణపు పనులు చేపట్టాలని సూచించారు. హౌసింగ్ కాలనీలో ఇల్లు పూర్తయిన వెంటనే ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కోగిలేరు చెందిన ముగ్గురు లబ్ధిదారులతో పొదుపు సంఘాల నుండి నగదు అప్పుగా తీసిఇవ్వాలని కోరడంతో ఎంపీడీవో సంబంధిత పొదుపు ఖాతాల నుండి నగదు వారికి అప్పుగా మంజూరు చేయాలని సంఘమిత్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చిన్న రెడ్డమ్మ, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, సచివాలయ సిబ్బంది వనజ, నజీర్ భాష, జ్యోతిస్వరూప్, వాణి, టెక్నికల్ అసిస్టెంట్ పల్లవి, అజిత, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు నాగేశ్వరరావు వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న హౌసింగ్ అధికారులు

## బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ మహాజన సభ

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ 50వ మహాజనసభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ బజార్ బడ్జెట్ జమా ఖర్చులు, అకౌంట్ వివరాలను తెలిపారు. ఈ సంవత్సరం ప్రారంభంలో 1,483 మంది సభ్యులతో 34 లక్షల 59వేల65 రూపాయల షేర్ ధనం కింద నిల్వ ఉండి ప్రస్తుత సంవత్సరంలో 738 మంది కొత్త సభ్యులు చేరగా సంవత్సరాంతంలో 14,821 మందితో 36 లక్షల 82 వేల ఎనిమిది వందల అరవై రూపాయల శాతం ధనం నిల్వ వుందన్నారు. ఈ సూపర్ బజార్ ఆడిట్ 2023 -24కు సంబంధించి ఇంకా కొనసాగుతోందని సూపర్ బజార్ అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులకు, వినియోగదారులకు, వ్యాపారస్తులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో ఇంకా సూపర్ బజారును మెరుగుపరిచే విధంగా ప్రయత్నిస్తామని అధ్యక్షులు ఆర్ వి బాలాజి తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అధ్యక్షులు ఆర్వి బాలాజి వైస్ ప్రసిడెంట్ సుధాకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సత్యమూర్తి, జగదీష్, కుమార్, శ్రీరాములు, అస్రఫ్ అలీ, సెల్వరాజ్, సీనప్ప గౌడ్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 విద్యార్థులకు జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు నిర్వహించారు. దీనిలో గెలుపొందిన క్రీడాకారులు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ ఎస్.బాబు తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీమన్నా రాయణ రెడ్డి, గణేష్, సురేష్, శ్రీధర్, గుర్రప్ప, సురేంద్ర, స్కేటింగ్ కోచ్లు మేనేజర్లు పాల్గొన్నారు.

## సోలార్ అభివృద్ధిలో వెంకటేష్ యాదవ్ ప్రతిభ

**ప్రజాశక్తి-కోట:** ఢిల్లీలో లీడర్స్ ఆఫ్ భారత్ నిర్వహించిన అవార్డ్‌లో జి.వెంకటేష్ యాదవ్‌కి అమీషా పటేల్ చేతుల మీదుగా శనివారం గ్రీన్ ఎన్ట్రెప్రిమియర్ ఆఫ్ ది ఇయర్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సోలార్ అభివృద్ధిలో తన ప్రాముఖ్యతను చాటి చెప్పి అవార్డును కూడా గెలుపొందారు. ప్రస్తుతం ఢిల్లీలో తీసుకున్న అవార్డుకు గాను పలువురు జి.వెంకటేష్ యాదవ్‌కు సోలార్ యాజమాన్యం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** పట్టణంలోని బాలాజీ నగర్ ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పొనకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమా రుడు పొనకా మల్లికార్జునరెడ్డి దాతగా వ్యవహ రించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతినెలా పేదలకు సరకులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీనివాసులు, పెంచలయ్య, నాగరాజు, ముని ప్రసాద్ పాల్గొన్నారు.

# 1న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు పంపిణీ

### జిల్లాలో 2,69,677 మందికి రూ.113.77 కోట్లు : కలెక్టర్

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ :** అక్టోబరులో 'ఎన్టిఆర్ భరోసా' పెన్షన్‌లు లబ్ధి దారుల ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్‌ల పంపిణీ చేస్తామని జిల్లాలో 2,69,677 మందికి సుమారు రూ.113.77 కోట్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1వ తేది, 3వ తేదీలలో మాత్రమే పంపిణీ చేస్తామని, అక్టోబర్ రెండవ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో 3వ తేదీ పంపిణీ చేస్తామని తెలిపారు. వివిధ కేటగిరీలలో సామాజిక భద్రత పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని, అక్టోబర్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుండే పంపిణీ చేస్తామని అక్టోబర్ 1న, 3వ తేదీల్లో మాత్రమే పంపిణీ చేస్తారని, పెన్షన్ లబ్ధిదారులు అక్టోబర్1 వ తేదీనే తమ ఇంటి వద్దే ఉండి పెన్షన్ తీసుకోవాలని, ఒకటో తేదీ పెన్షన్ తీసుకోని వారు 3 వతేదీ పెన్షన్ తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: సిఐ

**ప్రజాశక్తి -వెదురుకుప్పం, కార్వేటినగరం:** తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడం హర్షణీయమని ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం సిఐ ఎస్ హనుమంతప్ప అన్నారు. స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ, రాచపాళెం , తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సంయుక్త సహకారంతో కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సిఐ ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి వైద్యులు, సహాయక సిబ్బంది పాల్గొని శిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కార్వేటి నగరం పరిసర గ్రామాల నుంచి 230 మంది హాజరై ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా 57 మందిని లోపం వున్న రోగులుగా గుర్తించి వారికి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి వారి ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ సభ్యులు డైట్ లెక్చరర్ బి చెంగల్రాజు, పరమాల పేట వ్యవసాయ అధికారి విజయకుమార్, ట్రాన్స్‌కో డీఈ ఎం తులసిరామ్ పాల్గొని శిబిరానికి హాజరైన వారికి భోజన వసతి, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ శిబిరంలో జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పుత్తూరు శాఖ అధ్యక్షులు బి భాస్కర్ రాజు, కార్వేటినగరం వ్యవసాయ విస్తరణ అధికారి హేమాద్రి, అరవింద్ కంటి ఆస్పత్రి కోఆర్డినేటర్ దిలీప్, కార్వేటినగరం, చుట్టుపక్కల ప్రాంత గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఎంపికైన 35 మందికి సోమవారం శస్త్ర చికిత్సలు నిర్వహించనుండగా 22 మందికి మంగళవారం శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారందరిని రవాణా సౌకర్యంతో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉచితంగా శాస్త్ర చికిత్స మందులు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కార్వేటినగరంలో ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కార్వేటినగరం సిఐ ఎస్ హనుమంతప్ప



రామకుప్పంలో

**రామకుప్పం :** మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి, దేవాలయ అభివృద్ధి కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 80 మందికి పైగా కంటి సమస్యలకు సంబంధించిన రోగులకు వైద్య సేవలు అందించారు. ఇందులో కంటి సమస్యలు విపరీతంగా ఉన్న పది మందికి ఆపరేషన్ నిమిత్తం పెద్ద ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆస్పత్రి పీఆర్వో వెంకటేష్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, సీతాపతి, పీఈఎస్ కళాశాల వైద్యులు మని శంకర్, బషీర్, చరిష్మా పాల్గొన్నారు.

## మాధవికి డాక్టరేట్

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు విద్య, సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత ఎన్.మాధవికి "గౌరవ డాక్టరేట్"తో సత్కరించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో పాటు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మాధవిని అప్పస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు ఎన్.విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గంగయ్య, జిల్లా నాయకులు ఓబుల వెంకట రమణారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, టీ.వెంకటేశ్వర్లు, భాస్కర్ రాజులు సత్కరించి, అభినందనలు తెలిపారు. వీరితో పాటు గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.




మాధవిని అభినందిస్తున్న పలువురు ప్రముఖులు

# ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం

**ప్రజాశక్తి-క్యాంపస్:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం యూనిట్-4 ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన 5కే వాకథాన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. తిరుపతిలోని అమరా హాస్పిటల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 300మంది వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ సేతురామ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.చందూలాల్ వంటి ముఖ్య వ్యక్తులు, ఇతర అధికారులు, ప్రొఫెసర్‌లతో పాటు, ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌కు సహకరించారు. ఈ చొరవ గుండె ఆరోగ్యం గురించి అవగాహన పెంచడమే కాకుండా సమాజ సంబంధాలను బలోపేతం చేసిందని చెప్పారు.




వాకథాన్ కార్యక్రమంలో విద్యార్థులు

## అపూర్వ కలయిక

**ప్రజాశక్తి - యర్రావారిపాళ్యం:** మండలంలోని ఆదర్శ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. 2015-16సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి విందు ఏర్పాటు చేశారు. పాఠశాలలో తమకున్న అనుభవాలు, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బీటీ శ్రీదేవి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండడం గర్వంగా ఉందన్నారు. ఉన్నత లక్ష్యంతో ఎంచుకొని చదువుల్లో రాణించాలని ఎంఈవో బాలసుబ్రమణ్యం అన్నారు. తమ వంతుగా పాఠశాలకు ఉచితంగా ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

# పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే బిగ్ ఫాంటసీపై చర్చ

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ ఆధ్వర్యంలో "బిగ్ ఫాంటసీస్ గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ (పెద్ద కలలు: మీ ఊహలకు రెక్కలు తొడగండి)" అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ చర్చకు మందిరా బేడి, ప్రకాశ రావు (మాజీ ఇస్రో డైరెక్టర్), డాక్టర్ మేఘా మహాజన్ (డిఎం- నిమ్హాన్స్), రెవ రోహన్ డి అల్మేడా (ప్రిన్సిపాల్, సెయింట్ జోసెఫ్ పాఠశాల) హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్, బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ షేర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో సాంకేతికతతో కళను మిళితం చేయడం ద్వారా పిల్లలలో సృజనాత్మకత ఊహాశక్తిని పెంపొందించటం బ్రాండ్ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో అంతరిక్ష పరిశోధన, విద్యారంగం, మనస్తత్వశాస్త్రం సృజనాత్మక కళల రంగాలకు చెందిన ప్రముఖులతో "ఇంపార్టెన్స్ ఆఫ్ ఇగ్నైటింగ్ ఏ చైల్డ్స్ ఇమాజినేషన్" (పిల్లల ఊహను ప్రేరేపించడం యొక్క ప్రాముఖ్యత) అనే అంశంపై వివరణాత్మక ప్యానెల్ చర్చ జరిగిందన్నారు. పిల్లల సమగ్ర వికాసానికి కల్పన అనేది ప్రాథమిక అంశంగా ఎలా నిలుస్తుంది, అది సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ఎలా పెంపొందిస్తుంది, కొత్త ఆలోచనలను రేకెత్తించడంలో, సవాళ్లను అధిగమించడంలో వారికి ఏ విధంగా సహాయపడుతుందనే అంశాలను ప్యానెల్ చర్చించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## క్రైం న్యూస్

## గాయపడిన వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ఫ్యాక్టరీ నుండి విధులు ముగించుకుని సైకిల్‌పై శుక్రవారం ఇంటికి వెళుతున్న ఓ వృద్ధుడిని బొలోరో వాహనం ఢీకొంది. ఎస్ఆర్ పురం పోలీసుల సమాచారం మేరకు తమిళనాడు తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు తాలూకా ఐవి పట్టెడ గ్రామానికి చెందిన ఎస్ఎన్‌జి షుగర్ ఫ్యాక్టరీ లో కూలీ పని చేస్తున్న వేలు (65) డ్యూటీ ముగియడంతో సైకిల్ పై ఇంటికి వెళు తుండగా ఎస్ ఎన్‌జి ఫ్యాక్టరీకి చెందిన బొలోరో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చెన్నై హాస్పిటల్ కి తరలించారు. ఇతను చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

## వాన కోసం వలస దేవర్లు

**ప్రజాశక్తి-సోమల:** సోమల మండలం ఎస్ నడింపల్లి, కరక మంద గ్రామాలకు చెందిన ప్రజలు వర్షం కోసం వలస దేవర్లు నిర్వ హించారు. ఉదయం రెండు గ్రామాలలోని గంగమ్మ విగ్రహాలకు పూజలు నిర్వహించి మహిళలు తట్టా బుట్టా సర్దుకుని మూకు మ్మడిగా గ్రామస్తులంతా ఒక్కసా రిగా గ్రామం విడిచి వెళ్లారు. అందరూ వారి వారి పంట పొలాల వద్దకు వెళ్లి వనభోజనాలు నిర్వహించి పిల్లాపాపలతో మహిళలు, వృద్ధులు అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య ఆటపాటలతో సాయంత్రం 5 గంటలు వరకు గడిపారు. 6 గంటల సమయంలో గ్రామస్తులంతా గ్రామం వద్దకు చేరుకొని అందరూ గ్రామంలోకి వెళ్లి నాలుగు మొగసాళ్లకు, గంగమ్మలకు పూజలు నిర్వహించారు. వాన దేవుడి కోసం వలస దేవర్లు పాటించామని కరువు రాకుండా వరుణదేవుడు కరుణించాలని పూజలు చేసి మొక్కులు చెల్లించామని వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు ప్రజలు అందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ వలస దేవర్లు పాటించినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఆనందంతో నృత్యం చేస్తున్న మహిళలు

## వైసీపీ నేతల ఇంట విషాదం..

### - కర్మక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** "తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పలువురు వైసీపీ నేతల ఇంట విషాదం చోటుచేసుకుంది. సాయినగర్ పంచా యతీ ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి ఇటీవల మరణి ంచడంతో ఆదివారం జరిగిన ఆయన కర్మక్రియ లకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి దంప తులు హాజరయ్యారు. శ్రీరాములు రెడ్డి చిత్ర పటా నికి పుష్పాంజలి ఘటించిన చెవిరెడ్డి ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే గాంధీపురం పంచాయతీకి చెందిన వైసీపీ నేత మధుసూదన్ రెడ్డి తల్లి గున్నంరెడ్డి సరస్వతమ్మ కర్మక్రియలకు హాజరై ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం పేరూరు పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ పరందామ రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డి గత పది రోజుల క్రితం మరణించగా దశ దిన కర్మక్రియలకు హాజరైన చెవిరెడ్డి దంపతులు అంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం నంది మంగళం గ్రామానికి చెందిన కుమారి మోక్షిత(6) లివర్ వ్యాధితో బాధ పడుతుంది. ఈ విషయం తెలిసి ఆమె చికిత్స కోసం పేదవారికి సహాయం చేయాలన్న దృక్పథం తో దాత నగరి మున్సిపాలిటీకి చెందిన థాసన్ అమృత రాజ్ (టిఆర్ఎస్) వారి స్వగ్రామంకు వెళ్లి పేషెంట్‌కి రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## ఏరియా ఆసుపత్రికి బెడ్ వితరణ

**ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి):** చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తిరుపతి అర్బన్ అక్కారం పల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన జవాజి ఢిల్లీ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలందించాలని తన పెదనాన్న కొల్లా రెడ్డి పేరుతో అడ్వాన్స్ టెక్నాలజీ కలిగిన సుమారు రూ.30వేలు విలువతో కూడిన బెడ్డును ఆదివారం ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తన వంతు సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణ, డాక్టర్ చంద్రమోహన్, స్టాప్ నర్స్ జయమ్మ, ఫార్మసీ సిస్టర్ లలితమ్మ, 108 సిబ్బంది ఈఎంటి చంద్రారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రియాంకకు ఉత్తమ ప్రతిభా పురస్కారం



**ప్రజాశక్తి-సత్యవేడు:** సత్యవేడు సన్‌రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్, ఉపాధ్యాయురాలు ప్రియాంక ఉత్తమ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి బైరాగపట్టెడిలో జరిగిన ఒక కార్యక్రమంలో తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్ సమక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని ఉపాధ్యాయురాలు ప్రియాంకకు ప్రధానం చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, పుత్తూరు డిప్యూటీ డిఇఓ ప్రభాకర్ రాజు, సన్ రైస్ హైస్కూల్ కరస్పాండెంట్ సతీష్ తదితరులు హాజరయ్యారు. ఎస్ఎస్సి టాపర్స్ విషయంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు సన్‌రైస్ హైస్కూల్ చైర్మన్ ప్రియాంకకు ఈ ప్రతిభ పురస్కారం వరించింది. ఈ నేపథ్యంలో మేమంటో, ప్రశంస పత్రాన్ని ప్రియాంక అందుకున్నారు.

# నరాల బలహీనతకు అపోలోలో మెరుగైన వైద్యం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** నరాల బలహీనతకు అపోలో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుబాటులో ఉన్నట్లు అపోలో వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య వీధిలోని అపోలో క్లినిక్‌లో డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో కనిపించే న్యూరోడెజెనరేటివ్ పరిస్థితులు, సాధారణంగా వృద్ధ జనాభాను ప్రభావితం చేసే పరిస్థితులు అన్నారు. ముఖ్య లక్షణాలు జ్ఞాపకశక్తి, భాష, దృశ్యమానత గుర్తింపు, నావిగేషన్, కార్యనిర్వాహక, ప్రణాళిక నిర్ణయం తీసుకోవడం వంటి ఇబ్బందులు వుంటాయన్నారు. అనారోగ్య తీవ్రతలో అభివృద్ధి చెందుతున్నప్పుడు కనిపించే వివిధ ప్రవర్తన, మానసిక లక్షణాలు, మెదడు స్కానింగ్ వంటి కొత్త రోగనిర్ధారణ పద్ధతులు, ముందు మరింత ఖచ్చితమైన రోగ నిర్ధారణలో సహాయ పడతాయన్నారు. నివారణ చర్యల గురించి జ్ఞానాన్ని పెంచడంతో పాటు, అల్జీమర్స్ వ్యాధి ప్రారంభంలో యాంటీ-అమిలాయిడ్ మోనోక్లోనల్ యాంటీ బాడీస్, డిమెన్షియాలో కనిపించే న్యూరోసైకియాట్రిక్ సమస్యలను నిర్వహించడానికి వివిధ కొత్త మందులు వంటి కొత్త చికిత్స ప్రస్తుతం అపోలో ఆస్పత్రిలో అందుబాటులో వుందని అపోలో వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ తెలిపారు. మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి పరిస్థితులకు చికిత్స చేయడంలోనూ, చికిత్సలో ప్రధాన మార్పులు సంభవిం చాయని తెలిపారు. ఇది సాధారణంగా 20-50 సంవత్సరాల వయస్సు గల వారిని ప్రభావితం చేస్తుందని తెలిపారు. చాలా వైకల్యాన్ని కలిగిస్తుందని, ఈ మందులలో సిడి-20 మోనోక్లోనల్ యాంటీబాడీస్, అనేక ఇతర వ్యాధిని సవరించే మందులు ఉన్నాయన్నారు. మస్తీనియా గ్రావిస్, సాధారణంగా కనిపించే డయాబెటిక్ న్యూరోపతి వంటి పెరిఫెరల్ పాలీన్యూరోపతి వంటి ఇతర సాధారణ పరిస్థితులకు కూడా మెరుగైన నిర్వహణ ఎంపికలు అందుబాటులో వున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

### అపోలో వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్




మాట్లాడుతున్న డాక్టరు శ్రీకాంత్ శ్రీనివాసన్

# ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు, పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. తిరుపతి నగర పరిధిలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం జరిగిన ఈ ఉత్తమ పురస్కారాల ప్రధానం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై 150 ఉత్తమ ఉపాధ్యాయులకు, పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరచిన 200మంది విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజం మంచి పయనంలో వెళ్లడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమన్నారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్య బోధన చేసి ఉత్తమ పౌరులను సమాజానికి అందించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్, ఉప విద్యాశాఖ అధికారులు బాలాజీ, ప్రభాకర్ రాజు, అప్స రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా అప్స అధ్యక్షులు డాక్టర్ ఎల్.రమేష్ బాబు, కార్యదర్శి పి.లోకేష్, కోశాధికారి వి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలను అందిస్తున్న ఎమ్మెల్యే